# ఆఖరికి మగమహారాజు

ముదిగంటి సుజాతారెడ్డి



భయమెందుకే అంటుంది సావిత్రి. ఇక దేవుడంటే వున్నాడో లేడో నాకు తెలియదు వున్నా మన మనస్సులోనే ఉంటాడు. మనస్సులో వుండే దేవుడితో భయమెందుకే అంటుంది సావిత్రి.

నేనూ సావిత్రి పదో తరగతి దాటలేకపోయాం. నేను ఏమీ రాని ఏమీ తెలియని మొద్దుననుకుంటె సావిత్రి అన్నీ వచ్చింది ! అన్నీ తెలిసింది మరి పరీక్షలో ఫెయిల్ ఎందుకయిందో తెలియదు. అది నాకన్నా సినిమాలు ఎక్కువగా చూస్తుంది. నా కొక్కకసారి అనిపిస్తుంది - ఆ సినిమాల వల్లే దానికీ మొండి ధైర్యం చలాకీతనం తెలివీ వచ్చాయని ! నేను సినిమాలు ఎక్కువగా చూడను. చూడనంటె మా ఇంట్లో నన్ను ఎక్కువగా సినిమాలకు పోనియ్యరు. పోతే చెడిపోతారని మా నాయన నమ్మకం. పిల్లలు చేతుల్లో లేకుండా పోతారంటాడు.

"సినిమాలతో ఏం చెడిపోతారురా వాళ్ళ బుద్ధులు చక్కగుండాలి కాని !" అంటుంది మా నాయనమ్మ.

మా నాయనమ్మ చిన్న వయస్సులో భర్తను పోగొట్టుకొని అన్ని సరదాలకు దూరమైంది. కాబట్టి మేం అన్ని సరదాలు అనుభవించాలని ఆమె అభీష్టం.

"పిల్లల్ని సినిమాలు చూడనీ ! లోకం ఎట్లా వుంటుందో తెలుస్తుంది. అని మెట్రిక్ ఫెయిలయి ఇంట్లో కూర్చుంది. ఒక అయ్య చేతిలో పెడ్తే వెళ్ళిపోతుంది ! అదేదో వాడే కట్టడి చేసుకుంటాడు. నువ్వెందుకు దాని మనస్సును చిన్న బుచ్చుతావురా !" అని మా నాయనమ్మ కొడుకును నిలదీసినా లాభం లేకుండా పోతుంది.

సావిత్రి మొదటినుంచీ కూడా ధైర్యస్తురాలు. ఎదుటి వాళ్ళెవరూ అని చూడకుండా ఏమాటయినా ముఖం మీద అనగల్గుతుంది. దాన్ని చూస్తే ఒక్కొకసారి నాకు ఈర్ష్యగా వుంటుంది. నేనేమో ఎవరేది చేసినా ఎవరేమన్నా మాట్లాడకుండా కండ్లల్లో నీళ్ళు కుక్కుకొని సహించే రకం. నాకర్మ.! - అని మాట్లాడకుండా వుండే వాళ్ళల్లో నన్ను జమకట్టవచ్చును. అంటె ఇంకోవిధంగా చెప్పాలంటె నేను చాలా భయస్తురాల్ని. మనుషులన్నా భయం ! దేవుడన్నా భయం ! వాళ్ళు మనలాగా మనుషులే

" ఆ సినిమాలేవో పెండ్లయినంక చూడమనరాదే అమ్మా !" అంటాడు మా నాయన చలించకుండా సంపాదిస్తున్న ఇంటి యజమానులని మగవాళ్ళకు అన్ని అధికారాలు ! వాళ్ళ కెదురు చెప్పటం ఎవరి తరమౌతుంది !

సినిమాలు చూడక నా బుద్ధి కుంటుపడ్డది - సావిత్రి బుద్ధి పదునుదేలింది ! అని అనిపిస్తుంది. ఒక్కొక్కసారి నాకు. మా అదృష్టాలు

బాగుండి మాకు తొందరగానే సంబంధాలు కుదిరి పెండ్లిళ్ళు అయిపోయాయి. దానిలో కూడా సావిత్రి అదృష్టవంతురాలనిపించింది నాకు. అదృష్టవంతురాలని చెప్పాలో దాని మాటల తెలివి చేతల తెలివి అని చెప్పాలో నాకు తెలియదు. దానికి మంచి సంపాదన పరుడైన భర్త దొరికాడు. దాని చెప్పు చేతల్లో నడుచుకునేవాడు. నాకేమో నా మాటంటే పడనివాడు దొరికాడు. ముక్కుకు సూటిగా పోతానంటాడు. అంటే లౌకిక భాషలో చెప్పాలంటే పై సంపాదన సంపాదించే తెలివి లేని వాడని చెప్పాలె. తన ఖర్చులకని కొంత వుంచుకోగా మిగిలిన నెల జీతం తెచ్చి చేతిలో పెడ్తాడు. నీ ఇష్టం ! - సంసారం ఎట్లా ఈదుతావో ఈదు అన్నట్లుగా పైగా అక్కడికేదో నాకు కావల్సినంత డబ్బు యిచ్చి స్వాతంత్ర్యం ఇచ్చనట్టుగా మాట్లాడతాడు. ఇది కావాలె అది కావాలె అంటె మాత్రం కోపంతో ఏం చేస్తాడో అతనికే తెలియదు. అట్లా నా బుద్ధి తక్కువతనం వల్లనో ఎదురు తిరిగే తెలివి లేకపోవటం వల్లనో చాలాసార్లు దెబ్బలు తిన్నాను. అందరి మగవాళ్ళలాగే తాగి రావటం మనస్సులో వున్న బాధలు వేదనలన్నిటినీ నా ఒంటి మీద దెబ్బల రూపంగా చూపించి ఉపశమనం పొందటం ఆయనకలవాటే ! అయినా పడివున్నాను. అట్లా జీవితం సాగిపోతూనే వుంది. నలుగురు పిల్లలు పుట్టారు. వాళ్ళతో ఆయన ఇచ్చిన డబ్బుతో ఎట్లనో అట్ల పుట్టారు. వాళ్ళతో ఆయన ఇచ్చిన డబ్బుతో ఎట్లనో అట్ల సంసారం ఈదు కొస్తున్నాను. నాలోని అన్ని కోరికలు ఆ పిల్లల మీద పెట్టుకుని ఆశావాదిగా బతుకు లాక్కొస్తున్నాను.

నాలాగా సంసారం లాక్కురమ్మంటే సావిత్రి వల్ల ఎందుకవుతుంది! ఎదురు తిరగటం దాని రక్తంలోనే ఉందాయె ! భర్త కావాల్సినంత ఖర్చులకు ఇయ్యటం లేదని తాగటం అలవాటయి రోజూ తాగి ఇంటికి వస్తున్నాడనీఇంటినీ పిల్లల్ని (దానికీ నలుగురు పిల్లలు పుట్టారు) పట్టించుకోవటం లేదని అప్పు డప్పుడూ పోయి తల్లికీ తండ్రికీ చెప్పుకొనేది. ఒకరోజు ఆఖరికి తెగింపు చేయనే చేసింది సావిత్రి. "నీ పిల్లల్ని నువ్వు ఏమైనా చేసుకో ! సాదుకుంటావో సంపు కుంటావో నీ ఇష్టం !" అని భర్త ముఖం మీద అనేసి ఇల్లు వదిలిపెట్టి తల్లి తండ్రి ఇంటికి వచ్చేసింది.

"పిల్లలే ! ఆఖరి వాడికి రెండేండ్లయినా లేవు. వాళ్ళను మొగోడు నీ మొగుడు ఎట్లా చూసుకుంటాడే ? " అని తల్లిఏడ్చి మొత్తుకుంది.

"వాడి పిల్లల్ని వాడు ఏమైనా చేసు కోని నేనైతే వాడి తాగుడుని భరించ లేను. వాడి చాతగాని తనాన్ని సహించలేను !" అంది సావిత్రి మొండిగా. కూతురు సంసారం ఇట్లా అయిందే అని తండ్రి రంధి పెట్టుకుని ఆచింతతోనే ఓనాడు హఠాత్తుగా ప్రాణాలు విడిచాడు. ఇక ఇంట్లో అన్న తమ్ముడు మౌనం పాటించినా మునుపటి ప్రేమ ఆప్యాయతలు సావిత్రిమీద కురిపించలేదు. వాళ్ళ భార్యలు సావిత్రిని ఒక భారంగా భావించి మూతి ముక్కు విరవటం మొదలుపెట్టారు. ఇవన్నీ భరించలేక సావిత్రి "నేను మాత్రం వాళ్ళు పెట్టింది ఎన్నాళ్ళని మాత్రం తింటూ కూర్చుంటానని" అనుకుంది. ఏదైనా వ్యాపారం చేద్దామనుకుంది. ఉద్యోగం దొరకటం కష్టమని తెలుసు ! "నా బతుకు నేను సొతంత్రంగా బతుకుతాను" అంది సావిత్రి తల్లితో.

"ఎట్లా బతుకుతావే ! మగదిక్కు లేకుండా! మొగాడు లేని సంసారం మానులేని అడవి ఒక్కటే అంటారు నువ్వు పదోటన్న దాటక పోతివి. ఏం జేస్తవే !" అంది తల్లి బాధగా.

"చదవకపోతే ఏంది ! నా బతుకు నేను బతికి చూపిస్తాను." అంది సావిత్రి సవాలుగా

"ఏమోనే ! పైస చేతుల లేదు. ఏం జేస్తవే !" అంది తల్లి బాధగా మళ్ళీ.

"పైస లేకపోతే ఏంది ! ఇగో మెడల ఈ పుస్తె వుంది. దీన్ని అమ్మి- వచ్చిన పైసతోటి బేరం జేస్త !" అంది సావిత్రి.

" ఆచిన్న మెత్తు పుస్తె అమ్మితే ఏమొస్తదే" అని చిన్నబోయింది తల్లి.

"బేరం చేయాలంటే పైసకాదే ఇదిగో ఇది వుండాలె !" అని నెత్తి మీద వేలుతో కొట్టి చూపించింది సావిత్రి. అసలు నాకనిపిస్తుంది సావిత్రికి చదువాలని ఇష్టం లేక చదువలేదు. మెట్రిక్ పాస్కాలేదు. గాని నా లాగా బుర్ర లేక కాదు !

అన్నంత పని చేసింది సావిత్రి. అన్న పని చేసి చూపించటం సావిత్రి ఒంట్లోనే వుందాయె ! పుస్తె అమ్మితే వచ్చిన కొద్దిపాటి పైసతో సావిత్రి కూరగాయల బేరం పెట్టింది చిన్న చోటు చూసుకొని రోడ్డు మీద. ఆరు నెలల్లో దాని వ్యాపారం పెద్ద దుకాణంగా మారింది. కూరగాయలతో పాటు ఉప్పు పప్పులు అమ్మటం మొదలుపెట్టింది. ఏడాదిలో పెద్ద డిపార్టుమెంటల్ స్టోర్గా మారింది. ఎవరి నాలుక మీద చూసినా సావిత్రి స్టోరు అక్కడ దొరికే నాణ్యమైన వస్తువుల గురించే !

"ఇగనైనా పిల్లల్ని తోలుకరావే సావిత్రీ ! వండిపెట్టే దిక్కు లేక పిల్లలు అనాథబతుకులు బతుకుతున్నారట ! బిచ్చమెత్తుకునేది ఒక్కటే తక్కువగా వుందట ! నీ మొగుడు తాగుడు ఎక్కువైందే గాని ఏం తక్కువ కాలేదట ! మొన్న నీ మొగని మేనత్త కలిసి చెప్పింది !" అంది తల్లి బాధగా .

" మొగడు ఎవరిమొగడు ! పిల్లలు ఎవరి పిల్లలు! వానికి పిల్లలుకారా ? వాడు సాదుకోక పోతే నేనేం చేయను !" అంది సావిత్రి కసిగా.

"మొగోనికేం చాతనైతదే పిల్లల్ని సాదటం. పిల్లలంటే ఆడదానికున్న పట్టింపు ఓపిక మొగోని కెందుకుంటాయి ?" అంది తల్లి.

"లేకుంటే నేర్చుకుంటడు !" అంది సావిత్రి

"నేర్చుకుంటడు ! నా బొంద నేర్చు కుంటడు ! పిల్లల్ని నట్టేట ముంచి వచ్చినవు!" అంది తల్లి బాధగా. అయినా సావిత్రి లెక్క చేయలేదు. మంచి పాఠం నేర్పిన వానికి !" అనుకొని నవ్వుకుంది సావిత్రి.

సావిత్రి ధైర్యం నాకు ఆశ్చ ర్యం కలిగించింది. పిల్లల్ని వదిలి ఎట్లా బతకగల్గుతుందా అంత ఆత్మ విశ్వాసంతో ! అనుకున్నాన్నేను.

సావిత్రి వ్యాపారం ఎదుగుతున్నకొద్దీ అందరి దృష్టినీ ఆకర్షించింది. ఒంటరిస్త్రీ ఇదంతా ఎట్లా సాధించ గలిగిందో తవ్వి తీసారు పత్రికల వాళ్ళు. ఎలక్ట్రానిక్ మీడియా వాళ్ళు. తాగే "మొగున్ని వదిలేసి సొతంత్రంగా

బతుకుతున్న మహిళ !" అని పత్రికల్లో వ్రాసారు. టీవీలో అన్ని చానెళ్ళల్లో ఇంటర్వ్యూలు చూపారు. పిల్లల్ని భర్త బాధ్యతకు వదిలేసిన ఆధునిక మహిళ ! - అంది ఓ పత్రిక. ఇక టీవీ వాళ్ళు పిల్లల్ని గురించి అడిగినప్పుడు పిల్లలంటె ఆడదానికి ఒక్కదానికే కారు. భర్తకూ పిల్లలే ! ఆడది పెంచినట్లుగా మొగోడెందుకు పెంచ కూడదు ! - అంది సావిత్రి చిరునవ్వుతో సాహసంగా. అందరు ఆడవాళ్ళలాగా దాని కండ్లలో నీటి తెర లేదు. కన్నీళ్ళు ధారలుగా కారలేదు. "నిజంగా సావిత్రి ఈ ప్రపంచాన్ని ఎదిరించి గెల్చింది !" అనుకున్నాన్నేను. నా ఎద ఉప్పొంగి పోయింది. దాన్ని టీ.వి.లో చూస్తుంటే. ఇక మహిళా సంఘాలు ఈ సావిత్రి ఆ నాటి సావిత్రి కాదు స్త్రీలందరికీ ఈ సావిత్రి ఆదర్శవంతురాలని పొగుడుతూ సభలు పెట్టి సన్మానాలు చేసారు. ఇవన్నీ నాకెందుకు అంటూనే సావిత్రి చాలా ఆత్మవిశ్వాసంతో వేదిక మీద కుర్చీలో కూర్చుంది. తనను గురించి సాగే పొగడ్తలు విన్నది సభలో సావిత్రిని చూసి నా మనస్సు గర్వంతో ఊగిపోయింది.

సావిత్రి ఆధునిక మహిళ ! - సమాజాన్ని కట్టుబాట్లను పురుషప్రపంచాన్ని ఎదిరించి స్వతంత్రంగా బతికి చూపిస్తున్న మహిళ ! - అని మహిళా సంఘం అధ్యక్షురాలు సావిత్రిని ప్రశంసిస్తుంటే సావిత్రి నిజంగా తను అనుకున్నది సాధిస్తుంది ! - చిన్నప్పట్నుంచి దాని తత్త్వం అంతే ! - అని నాకు ఒళ్ళు పులకరించింది. పత్రికలవాళ్ళు సావిత్రి ఫోటోలను వేసి ఆమె జీవితాన్ని గురించి చాల చాల వ్రాసారు. సావిత్రి అందరికీ మోడల్ వనిత అన్నారు. ఇక స్త్రీల ప్రత్యేక పత్రికలు అట్టమీదనే సావిత్రి బొమ్మను వేసి ఆమె జీవితంలో చూపిన తిరుగుబాటును తెగువను వ్యాపారంలో సాధించిన విజయాలను , స్త్రీ శక్తిని గురించి గొప్పగా వ్రాసాయి. అదంతా చదివి నేనయితే సావిత్రిలాగా తెగించలేక పోయాను. నా పిల్లలయినా దానటువంటిది కావాలని కోరుకున్నాన్నేను.

సావిత్రి విజయాలు అందరి నోళ్ళల్లో మెదుగుతున్న తరుణంలోనే ఓ దుర్వార్త తెలిసింది - సావిత్రి భర్త నలుగురు పిల్లల్ని ఇంట్లో వదిలేసి వెళ్ళిపోయాడని ! ఎక్కడికి పోయి వుంటాడు ! - సన్యాసుల్లో కలిసిపోయాడని కొందరన్నారు. లేదు - ఎవతెనో వేసుకొని బొంబాయి వెళ్ళిపోయాడని మరికొందరన్నారు. నిజంఏమిటో ఎవరికీ తెలియదు.

"పిల్లల్ని అనాథలను చేసి దిక్కులేనిపక్షులను జేసి పారిపోయిండు. దగుల్బాజిగాడు ! వాన్ని నమ్ముకొని పిల్లల్ని వదిలేసి వస్తే ఎంత పనయిందో చూడవే సావిత్రీ ! అని ఏడ్చే తల్లి వేపు తెల్లబోయిన మొఖంతో చూసింది సావిత్రి.

"పిల్లలు ఆఖరికి సావిత్రి మెడకే పడ్డారు! ఆఖరికి మగమహారాజు! ఏం చేసినా చెల్లు తుంది !" అని నిట్టూర్పు విడిచాడను నేను.

## విజ్ఞప్తి

**ప్రస్తుత చినుకు చందాదారులు కాబోయే చందాదారులు తమ ఫోన్ నెంబర్లను సత్వర సమాచారం కోసం తెలియజేయండి**

# మహాభినిష్క్రమణం

## అంకే శ్రీనివాస్

పట్టపగలు
నడి మధ్యాహ్నం
నా చేతిలో వెలుగుతున్న కొవ్వొత్తి
నా లాగే కాలుతూ కరుగుతోంది.
నాలుగు రోడ్ల కూడలి
నా కళ్లు ఎవరినో వెదుకుతున్నాయి

మనిషి కోసం
కేవలం మనిషి కోసం
సోక్రటీసు క్రీస్తు మహమ్మదూ
నా ముందు అందరూ కదిలిపోతున్నారు

చివరన వాడు
కొంచెం ఆగాను
వాడు మనిషిగా నిలబడ్డాడు
మతంలా ప్రశ్నిస్తున్నాడు
బక్కపలచని మూడు కాళ్ల ముసలి
నడుముకు గోచి
గోచికి వేలాడే వాచి
సత్యం అహింస మతం మానవత్వం
వాడినోట వెంట ప్రవాహమైనాయి
ఉద్యమమై వెల్లువెత్తాడు
నేను వెదికింది వాడి కోసమే
కానీ !
వాడూ ! ఉన్మాదానికే బలైపోయాడు
నాయకత్వాన్ని రాజకీయానికి అప్పగించి
తలదించుకు వెళ్లిపోయాడు.

నా ముందు అందరూ వెళ్లిపోతున్నారు
మనిషిని మనిషిగా చూసే మనిషికోసం
వాదాలు వేదాలు మతాలు జాతులు లేని
వక్త ప్రవక్త కాని మనిషి కోసం
కరిగే కొవ్వొత్తి
కాలే నేను
ఎదురు చూపుల నాలుగు రోడ్ల కూడలి